సాక్షి తిరుపతి

శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



సమస్యల పరిష్కారానికి కృషి

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ ఎం.బాలస్వామి తెలిపారు.
- IIలో



భారీగా గంజాయి స్వాధీనం

తిరుపతి జిల్లాలో వేర్వేరు చోట్ల పోలీసులు దాడులు నిర్వహించి భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- IIలో



అర్హతే ప్రామాణికం

అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోంది.
- IIలో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొంత తక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్ మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 61,403 మంది స్వామివారిని దర్శించుకోగా 19,126 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.37 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆకాశ దీపం



కార్తీక దీపానికి పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం ఆకాశదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. మొదట ఊంజల్‌సేవా మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రాబడి రూ.55 లక్షలు

తిరుపతి అర్బన్: పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని తిరువణ్ణామలైకి 11 డిపోల నుంచి 216 సర్వీసులు ఏర్పాటు చేయగా మొత్తం రూ.55 లక్షల మేర రాబడి వచ్చినట్టు డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు సర్వీసులు ఏర్పాటు చేసినట్టు ఆయన వెల్లడించారు. 93శాతం ఆక్యుపెన్సీ రేషియో సాధించినట్లు పేర్కొన్నారు.

మత్స్యశాఖ జిల్లా అధికారిగా నాగరాజు



నాగరాజు

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా మత్స్యశాఖ అధికారిగా నాగరాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్టీఆర్ జిల్లా మత్స్యశాఖ అధికారిగా పనిచేస్తున్న ఆయన తిరుపతికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన గతంలో చిత్తూరు ఉమ్మడి జిల్లాకు మత్స్యశాఖ డెప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఇదిలావుండగా తిరుపతి జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్ నాయక్‌ను అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. ఆ మేరకు ఆయన శుక్రవారం రిలీవ్ కానున్నారు.

డిజిటల్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు



సమావేశమైన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: డిజిటల్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది అని సోషియల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కూనాటి సురేష్ అన్నారు. పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో గురువారం సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కేవీబీపురం మండలాల ఉపాధ్యాయులు దీనికి హాజరయ్యారు. ఇందులో సోషల్‌ఫోరం ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు కూనాటి సురేష్ ప్రత్యేక పరిశీలకులుగా వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ సాంఘిక శాస్త్రానికి అవసరమైన డిజిటల్ పవర్ పాయింట్లు, వీడియోలు, పాఠ్య ప్రణాళికలు, వార్షిక ప్రణాళికలు, బోధన అభ్యసనా సామగ్రి, బోధన మెలకువలు, ఆన్‌లైన్ క్విజ్‌లు, మోడల్ పేపర్లు రాష్ట్ర ఫోరం తయారు చేసి అన్ని జిల్లాలకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

వర్షాతిరేకం

- జిల్లాలో కుండపోత వర్షాలు
- రేపటి నుంచి మరో తుపాన్
- నిండుతున్న చెరువులు
- పొంగుతున్న వాగులు, వంకలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

జిల్లాలో వర్షాలు ఊపందుకున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వానలతో వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. రోడ్లు జలమయమవుతున్నాయి. చెరువులు ఇప్పుడిప్పుడే నిండుతున్నాయి. నదులు జల కళతో మురిసిపోతున్నాయి. కొండ ప్రాంతాల్లోని వాగులు, వంకలు తొణికిసలాడుతున్నాయి. గతానికంటే భిన్నంగా ఈ సారి వ్యవసాయ పనులు జోరందుకున్నాయి.

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా అంతటా వర్షాలు బలపడుతున్నాయి. అడపాదడపా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా రూపాంతరం చెంది ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు తుపాన్‌గా మరే అవకాశాలు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. దీంతో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ముందస్తు చర్యల్లో నిమగ్నమయ్యారు. ఇదిలావుండగా నవంబర్‌లో 288.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 186.3 మి.మీ మాత్రమే నమోదైంది. ఈ ఏడాది జూన్ నుంచి నవంబర్ వరకు 905.9 మి.మీ వర్షపాతానికి గాను 594.3 మి.మీ వర్షపాతం నమోదైంది. శనివారం అత్యధికంగా తడ మండలంలో 137.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా.. అత్యల్పంగా చిన్నగొట్టిగల్లులో 3.7 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే వెంకటగిరిలో 100.8 మి.మీ, వరదయ్యపాళెం 87.6, సత్యవేడు 74.8, ఏర్పేడు 65.4, తిరుపతి అర్బన్ 54.4, రేణిగుంట 53.6, వాకాడు 52.6, వడమాలపేట 49.4, తొట్టంబేడు 49.2, బీఎన్ కండ్రిగ 48.6, శ్రీకాళహస్తి 48.4, సూళ్లూరుపేట 44.2, చిల్లకూరు 40.0, కోట 38.6, గూడూరు 36.4, నాయుడుపేట 35.6, కేవీబీపురం 31.2, చిట్టమూరు 29.2, దొరవారిసత్రం 29.0, డక్కిలి 28.2, చంద్రగిరి 22.4, ఓజిలి 17.8, తిరుపతి రూరల్ 15.4, పెళ్లకూరు 15.2, పిచ్చాటూరు 13.4, నాగలాపురం 11.2, నారాయణవనం 8.8, పాకాల 8.2, రామచంద్రాపురం 6.6, ఎర్రావారిపాళెం 6.3, పుత్తూరు 6.2, బాలాయపల్లి 3.8, చిన్నగొట్టిగల్లు 3.7 మి.మీ వర్షపాతం నమోదైంది.



పాముల కాలువ వద్ద భద్రతా చర్యలపై సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ సుబ్రమణ్యంరాజు

సంతవేలూరు మార్గంలో రాకపోకలు బంద్

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు మార్గంలో రాకపోకలు స్తంభించాయి. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆ మార్గంలోని పాములకాలువ, పులిబొంద, మారేడు కాలువలకు నీటి ప్రవాహం ఉధృతమైంది. దీంతో రాకపోకలు స్తంభించాయి. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల వద్ద ద్విచక్ర వాహనాలు వెళ్లకుండా ఎస్‌ఐ నాగార్జున రెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యంరాజు, స్థానిక ప్రభుత్వ సిబ్బంది ద్వారా భద్రతా ఏర్పాట్లను చేపట్టారు. డిసెంబర్ 5 వరకు తుపాన్ ప్రభావం ఉన్నట్లు వాతావరణశాఖ ముందస్తు హెచ్చరిక చేయడంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. తహసీల్దార్ గౌరీశంకరరావు నేతృత్వంలో వీఆర్వోలు, వీఆర్ఏలు పర్యవేక్షణలో తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.


పులకించినది

శ్రీకాళహస్తీశ్వరుని పాదాల చెంత గంగమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఇన్నాళ్లూ బోసిపోయిన స్వర్ణముఖి నది జలకళతో మురిసిపోతోంది. సుడులు తిరుగుతూ.. పరవళ్లు తొక్కుతూ భక్తులను ఆకట్టుకుంటోంది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మరింత ఉప్పొంగే అవకాశం ఉందని యంత్రాంగం భావిస్తోంది. స్వర్ణముఖి నదిలో నీటి మట్టం 193.30 అడుగులకు చేరడంతో చెంబేడు కాలువ ద్వారా సుమారు 77.9 క్యూసెక్కుల నీటిని చెరువుల్లోకి మళ్లించింది. దాంతోపాటు ఆనకట్ట ద్వారా 3,973.63 క్యూసెక్కుల నీరు బయటకు విడుదలవుతోంది. కాగా డిసెంబర్ 12న స్వర్ణమ్మకు నదీ హారతులు ఇవ్వనున్న నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షం ప్రాధాన్యతను సంతరించుకుంది.

– శ్రీకాళహస్తి



స్వర్ణముఖి నదిలో నీటి ప్రవాహం



స్వర్ణముఖి నదిలో పరవళ్లు తొక్కుతూ..

ఆకాశగంగ అభిషేకం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : ఆకాశగంగ పరమశివుని అభిషేకిస్తున్నట్లుంది కదూ.. ఇది శ్రీకాళహస్తి మండలం, వేడం సమీపంలోని కైలాసగిరిల్లోనిది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండకోనల్లో జలధారలు ప్రవహిస్తున్నాయి. వేడం దక్షిణ కాళికాదేవి ఆలయానికి ఎగువ భాగంలో భైరవకోనలో వెలసిన శివలింగాన్ని ఇలా జలధార అభిషేకిస్తున్నట్టు కిందికి జాలువారుతుండడం భక్తులను అబ్బురపరుస్తోంది.



భైరవకోనలో శివలింగాన్ని అభిషేకిస్తున్నట్టు కిందికి జాలువారుతున్న జలధార

డ్రిప్పు.. రైతుకు గ్రిప్పు!

వ్యవసాయానికి జగనన్న ప్రభుత్వం అండ

- బిందు సేద్యం పరికరాలకు భారీ రాయితీ
- ఈ ఏడాది 1,035 మంది రైతులకు పరికరాల పంపిణీ
- రూ.10.83 కోట్ల మేర రాయితీ
- ఆనందంలో అన్నదాతలు

తిరుపతి అర్బన్: అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. విభిన్న పథకాలతో వ్యవసాయాన్ని పండగ చేస్తోంది. బీడు భూములు సైతం సాగులోకి తెచ్చేలా సూక్ష్మ సాగు నీటి పథకం కింద భారీ రాయితీలు ప్రకటిస్తోంది. సుమారు 45 నుంచి 90 శాతం వరకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందిస్తోంది. దీనిపై రైతాంగం సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తోంది. జిల్లాలో 2023–24కు సంబంధించి ఐదు వేల ఎకరాలకు రాయితీతో బిందు సేద్యం పరకరాలను అందించింది. దీనిద్వారా మామిడి, బత్తాయి, నిమ్మ, సపోటా, అరటి, కూరగాయాలు, మిరప, ఆయిల్‌పామ్, చెరుకు, మల్బరీ తదితర పంటల సాగువిస్తీర్ణం పెరుగుతోంది. మరోవైపు స్ప్రింక్లర్ల సేద్యంతో వేరుశనగ, మినుము పంటలను సాగులోకి తెస్తున్నారు.

బిందు సేద్యంతో ప్రయోజనాలు

నీరు, విద్యుత్‌తోపాటు ఎరువుల వినియోగంలో ఆదా చేయొచ్చు. పంట ఉత్పాదకత, మొక్క పెరుగుదల బాగుంటుంది. అధిక దిగుబడి పొందవచ్చు. పురుగులు, తెగుళ్ల ప్రభావం తక్కువ. కలుపు మొక్కల బెడద ఉండదు. నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది.

దరఖాస్తు చేసుకునే విధానం

రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు పొందడానికి ఆధార్ కార్డు, తహసీల్దార్ల ధ్రువీకరణపత్రం, భూమి యాజమాన్య పత్రం లేదా 1బీ రికార్డుతో రైతు భరోసా ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. తప్పనిసరిగా రైతు సెల్ ఫోన్ నంబర్‌ను నమోదు చేయించుకోవాలి. దాంతో ఎప్పటికప్పుడు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రాయితీల వివరాలను మెసేజ్‌ల రూపంలో రైతులకు అందుతాయి.

రాయితీలు ఇలా..

డ్రిప్ పరికరాలకు సంబంధించి 5 ఎకరాల్లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు యూనిట్ ధరలో 90 శాతం రాయితీ లభిస్తోంది. 8 ఎకరాలకంటే పైన 10 ఎకరాల్లోపు ఉన్నవారికి 70 శాతం రాయితీ ఉంటుంది. స్ప్రింక్లర్లు అయితే 5 ఎకరాల్లోపు సన్న, చిన్నకారు రైతులకు యూనిట్ ధరలో 50 శాతం, 5 ఎకరాలకు పైన 10 ఎకరాలకు లోపు వారికి 45 శాతం వరకు రాయితీ ఉంటుంది.



కేవీబీపురం: కళత్తూరులో డ్రిప్ పరికరాల పరిశీలన

2023-24లో బిందు సేద్యం ప్రగతి

నియోజకవర్గం	రైతుల సంఖ్య	విస్తీర్ణం ఎకరాల్లో	యూనిట్ విలువ రూ. లక్షల్లో
చంద్రగిరి	261	704.94	225.85
గూడూరు	317	926.23	378.27
నగరి	67	171.17	61.77
సత్యవేడు	178	485.03	213.42
శ్రీకాళహస్తి	93	225.21	90.44
సూళ్లూరుపేట	45	111.72	41.82
వెంకటగిరి	74	198.93	69.13
మొత్తం	1035	2823.23	1080.69

వ్యవసాయం..మరింత ప్రోత్సాహం



సీఎం జగనన్న వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహిస్తున్నారు. బీడు భూములు సైతం సాగులోకి వస్తున్నాయి. కదూరు గ్రామంలో 1.98 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్‌ను సాగుచేశా. సూక్ష్మ సేద్యం ద్వారా సబ్సిడీలో రాయితీలతో పరికరాలను పొందాను. సేద్యం చేయడానికి ఎంతో సౌకర్యంగా ఉంది. – పీ.స్వరూప, కదూరు గ్రామం, వరదయ్యపాళెం మండలం

ఎంతో సంతోషం



సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం భారీగా సాయాన్ని అందిస్తోంది. నేను 0.45 ఎకరాల్లో నిమ్మతోట సాగుచేశాను. నీరు అందకపోవడంతో ఇబ్బందులు పడే సమయంలో అధికారులను సంప్రదించాను. వెంటనే రాయితీపై డ్రిప్ పరికరాలు మంజూరు చేశారు. నేను నామమాత్రంగానే రుసుము చెల్లించాను. – ఎం.మురళీకృష్ణ, సూర్యపాళెం గ్రామం, డక్కిలి మండలం

45 నుంచి 90 శాతం రాయితీ



డ్రిప్ పరికరాలతోపాటు స్ప్రింక్లర్ల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం 45 నుంచి 90 శాతం వరకు రాయితీ ఇస్తోంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు ఈ ఏడాదికి సంబంధించి 5000 ఎకరాలకు సూక్ష్మ సేద్య పరికరాలను మంజూరు చేశాం. ఇప్పటి వరకు 1,035 మంది రైతులకు 2823.23 ఎకరాలకు మాత్రమే పరికరాలు అందించాం. మరో 2వేల ఎకరాలకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

–సతీష్, జిల్లా సూక్ష్మ నీటిసేద్య అధికారి

భక్తకనకదాసు జీవితం స్ఫూర్తిదాయకం

తిరుపతి అర్బన్: భక్తకనకదాసు జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో గురువారం భక్తకనకదాసు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కురువ సంఘ సీనియర్ సభ్యులు జయన్న మాట్లాడుతూ కనకదాసు ఒక గొప్ప కవి, పరమ భక్తుడు అని కొనియాడారు. జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్ రెడ్డి, కురువ సంఘ నాయకులు నంజుండప్ప, వెంకటనారాయణ, రమణ, రెడ్డికుమార్, మంగిరి రెడ్డెప్ప, రామచంద్ర పాల్గొన్నారు.



భక్తకనకదాసు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్, నేతలు

అమ్మవారి సేవలో వ్యాసరాజ మఠాధిపతి



అమ్మవారిని ఆలయం ఎదుట వ్యాసరాజ మఠాధిపతి శ్రీవిద్యాధీశతీర్థ స్వామీజీ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని గురువారం కర్ణాటకలోని వ్యాసరాజ మఠాధిపతి శ్రీవిద్యాధీశతీర్థ స్వామీజీ తన శిష్య బృందంతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబు స్వామి, సుభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా లక్ష బిల్వార్చన



కపిలేశ్వరస్వామికి లక్ష బిల్వ పత్రాలతో అర్చన

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో గురువారం లక్ష బిల్వార్చన సేవ వేడుకగా చేపట్టారు. ఉదయం 3 గంటలకు స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి అభిషేకం, అలంకరణ, అర్చన నిర్వహించారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష బిల్వార్చన సేవ చేపట్టారు. అలాగే సాయంత్రం చంద్రశేఖర స్వామి వారి ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీ డాక్టర్ గురుమూర్తిని సత్కరిస్తున్న పాస్టర్లు

తిరుపతి కల్చరల్: గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా క్రైస్తవుల సమస్యలపై సత్వరం స్పందిస్తున్నట్టు రాష్ట్ర క్రిస్టియన్ సెల్ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ ఎం.బాల స్వామి తెలిపారు. యాక్ట్స ఆధ్వర్యంలో గురువారం వెస్ట్ చర్చి స్టూడెంట్ సెంటర్‌లో క్రైస్తవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. క్రిస్టియన్స్ కమ్యూనిటీ సెంటర్లు, హెల్త్ సెంటర్లు, శ్మశాన వాటికలు, ప్రహరీ గోడలు వంటి సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వీటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ఎంపీ డాక్టర్ గురుమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ మూడు జిల్లాల జోనల్ చైర్మన్, రిటైర్డ్ ఏఎస్పీ ఎన్‌పీ.దేవదానం, వైఎస్‌ఆర్‌సీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బీవీ.పాలరాజు, కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యురాలు ఆర్.రాజేశ్వరి, సీనియర్ ఫాస్టర్లు మణిరాజు, అరుల్ అరుసు, మార్టిన్, రుద్రపాల్, కర్మేల్‌శామ్, జమీమా తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం..సంక్షేమమే లక్ష్యం

కులాలు చూడం.. మతాలు చూడం.. పార్టీల ప్రసక్తే రానీయం.. అర్హతే ప్రామాణికంగా తీసుకుంటాం... అంటూ నాడు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వంద శాతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తీవ్రంగా కృషి చేస్తున్నారు. గతంలో సంక్షేమ పథకాలు అందని పేదలు నేడు సంతోషంతో ఉప్పొంగిపోతున్నారు. జగనన్న సురక్షతో మరింత మేలు జరిగిందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– తిరుపతి అర్బన్



జగనన్న సురక్ష క్యాంపుల్లో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఇతర అధికారులు

దరఖాస్తు చేసుకున్న వెంటనే..



గత జూలైలో నా భార్య సిద్ధమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఇనుగుంట సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మరణధ్రువీకరణ పత్రానికి వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నా. గతంలో ఎన్నడూ లేనివిధంగా అధికారులు మూడు రోజుల్లోనే నా భార్య మరణధ్రువీకరణ పత్రాన్ని ఇంటికి తీసుకొచ్చి ఇచ్చారు. రూపాయి ఖర్చులేకుండా సర్టిఫికెట్ పొందా.

- ఎం.పోలయ్య, రావిపాడు పంచాయతీ, ఓజిలి మండలం

జగనన్న సురక్ష ఓ వరం



పేదోడికి జగనన్న సురక్ష పథకం ఓ వరంగా మారింది. కూలి పనులు వదులుకుని దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పనిలేకుండా పోయింది. దరఖాస్తు చేసుకుంటే అధికారులే ఇంటికొచ్చి సర్టిఫికెట్ ఇస్తున్నారు. నా జీవితంలో ఎక్కడా తిరగకుండానే సర్టిఫికెట్లు ఇంటికొచ్చి ఇవ్వడం ఇదే మొదటి సారి. చాలా సంతోషంగా ఉంది.

-భాగ్యలక్ష్మి, సిద్ధిరాజుకండ్రిగ, పిచ్చాటూరు మండలం

అక్కడికక్కడే సర్టిఫికెట్లు



జగనన్న సురక్ష క్యాంపులో నాకు అవసరమైన సర్టిఫికెట్లు అన్నీ అక్కడికక్కడే అందజేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మా నుంచి వివరాలు తీసుకుని కుల, ఆదాయ పత్రాలను అప్పటికప్పుడే అందజేశారు. గతంలో సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. జగనన్న ప్రభుత్వంలో మేము కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా పోయింది.

-మేడిబోయిన మల్లీశ్వరి, ముదిరాజ్ కాలనీ, కలువాయి

తిప్పలు తప్పాయి



గతంలో పొలం అడంగళ్, వన్‌బీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. జగనన్న ప్రభుత్వంలో సురక్ష క్యాంపుల ద్వారా మాకు అప్పటికప్పుడే సర్టిఫికెట్లు అందజేశారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలని అడిగిన వెంటనే వలంటీర్లు మావద్ద వివరాలు తీసుకుని సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం.

-ఎం.భాగ్యమ్మ, కలువాయి

సుదర్శనరెడ్డికి కన్నీటి నివాళి



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి చెంగారెడ్డి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తదితరులు

నారాయణవనం: మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి(78) మృతిచెందారు. వారం రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ మేరకు చెన్నైలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందారు. ఆయన భౌతికకాయానికి గురువారం మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, శ్రీశైలం ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, హైకోర్ట్ విశ్రాంతి జడ్జి దొరస్వామి కన్నీటి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే ఆదిమూలం, సుమన్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ 1985 వరకు కీళగరం వీఎంగా పనిచేసిన సుదర్శనరెడ్డి, 1987 జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో ఎంపీపీగా గెలుపొందారన్నారు. సింగిల్ విండో చైర్మన్‌గా, డీసీసీబీ డైరెక్టర్‌గా రైతాంగానికి సేవలందించారని కొనియాడారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు నారాయణవనంలో సుదర్శనరెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, ఏకాంబరం, కోనేటిబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

మామిడి తెగుళ్లపై దృష్టి సారించండి



మామిడితోటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారిణి శైలజ

చంద్రగిరి: వర్షాల కారణంగా మామడి చెట్లలో తరచూ వచ్చే తెగుళ్లపై రైతులు ప్రత్యేక దృష్టివహించాలని ఉద్యాన అధికారిణి శైలజ సూచించారు. గురువారం చంద్రగిరి, పాకాల మండలాల్లోని పలు మామిడి తోటలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మామిడి చెట్టుకు అవసరానికి మించి నీళ్లు అందించినా లేక వర్షాల కారణంగా అయినా బ్లాక్ బాండ్ అనే తెగులు వస్తుందన్నారు. ఈ తెగులు సోకిన కొమ్మలపైన 5 నుంచి 10 సెం.మీ పొడవు గల నల్లని వలయాలను గమనించవచ్చన్నారు. దీనికారణంగా పంట దిగుబడి తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ శిలీంద్ర నాశిని మందును పేస్ట్ లాగా చేసి మచ్చలపైన బ్రష్‌తో పూయడం కానీ, కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా.లు లీటర్ నీటిలో కలిపి చెట్టు కొమ్మలు బాగా తడిసేలాగా 15 రోజుల వ్యవధిలో 3 సార్లు పిచికారీ చేయడం ద్వారా తెగులు నివారించవచ్చన్నారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (ఏఐసీ) కేంద్ర ప్రభుత్వ సంస్థ వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పుతో పంట నష్టాల నుంచి మామిడి రైతులను ఆదుకోవడానికి సంపూర్ణ రీతూ కవచ్ (ఎస్‌ఆర్‌కె) అనే బీమా పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఆసక్తి గల రైతులు ఎకరాకు రూ.1,416 ప్రీమియం డిసెంబర్ 14వ తేదీలోపు చెల్లించాల్సి ఉంటుందన్నారు. డిసెంబర్ 15 నుంచి 2024 మే 31 వరకు అధిక వర్షపాతం, అధిక ఉష్ణోగ్రత, గాలిలో తేమ శాతం, ఉష్ణోగ్రతలో వ్యత్యాసం, అధిక గాలి వేగం వంటి అంశాల ఆధారంగా మాత్రమే ఎకరానికి రూ.24,000 బీమా ఏఐసీ ద్వారా బాధిత రైతుకు అందిస్తామని తెలిపారు.

మహిళ మృతిపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని మునలిపేడు వ్యవసాయ పొలాల సమీపంలోని పంబా కాల్వలో నీటి ప్రవాహానికి కొట్టుకుని వెళ్లి మృతిచెందిన మహిళ విషయమై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి గురువారం తెలిపారు. ఆయన కథనం.. శ్రీకాళహస్తి మండలం, సుబ్బానాయుడుకండ్రిగ ఎస్సీ కాలనీకి చెందిన సాయమ్మ(53) బుధవారం తమకున్న ఆవులను మేత కోసం ఏర్పేడు మండలంలోని మునలిపేడు వ్యవసాయపొలాల వద్దకు తోలుకొచ్చింది. వర్షాల నేపథ్యంలో అక్కడే పక్కన ఉన్న పంబా కాల్వలో పడి మృతిచెందింది. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని ఎస్‌ఎస్‌ఆర్ కాలనీ సమీపంలో రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు గురువారం గుర్తించారు. గూడూరు జీఆర్‌పీ ఎస్‌ఐ కొండప్ప నాయుడు కథనం.. ఎస్‌ఎస్‌ఆర్ కాలనీ సమీపంలో రైలు పట్టాల వద్ద గుర్తుతెలియని సుమారు 40 సంవత్సరాలలోపు వయస్సుగల వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే కీమెన్ కిరణ్‌కుమార్ గుర్తించారు. ఈ మేరకు స్థానిక స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. గూడూరు జీఆర్‌పీ రైల్వే పోలీస్టేషన్ ఎస్‌ఐతో పాటు స్టేషన్ రైటర్ జయప్రకాష్ నాయుడుపేటకు చేరుకుని రైలు పట్టాలపై పడిఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. తల ఛిద్రం కావడంతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. మృతుడు నలుపు ప్యాంటు, హాఫ్ హ్యాండ్ టీ షర్టు ధరించి ఉన్నాడు. ఈ మేరకు మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మారుతాళాలతో బైక్ దొంగతనాలు

- అంతర్ జిల్లాల దొంగ అరెస్ట్
- రూ.10.04 లక్షల విలువ చేసే 22 బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో ఎస్పీ, పోలీసు అధికారులు

నెల్లూరు(క్రైమ్): అతడు జల్సాగా జీవించాలనుకున్నాడు. అయితే తన సంపాదన అంతంతమాత్రంగా ఉండడంతో బైక్ దొంగతనాలపై దృష్టి సారించాడు. మారుతాళాలతో బైక్‌లను అపహరించి వాటిని అమ్మి సొమ్ముచేసుకుని జల్సా చేయసాగాడు. సదరు అంతర్ జిల్లాల దొంగ కదలికలపై నిఘా ఉంచిన నెల్లూరు రూరల్ పోలీసులు గురువారం నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 22 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి నిందితుడి వివరాలను వెల్లడించారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామానికి చెందిన ఎస్.మల్లికార్జున అలియాస్ మల్లి పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆపై వ్యవసాయ పనులు చేసుకుంటూ కారు డ్రైవింగ్ నేర్చుకున్నాడు. అతనికి ఆరేళ్ల క్రితం వివాహం కాగా కుటుంబ కలహాల నేపథ్యంలో ఏడాదికే భార్య అతనిని వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి జల్సాలకు, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. కారు డ్రైవింగ్, సెంట్రింగ్ పనులు చేసుకుంటూ వచ్చిన సంపాదనతో జల్సాలు చేయసాగాడు. రెండేళ్ల క్రితం నెల్లూరుకు వచ్చాడు. కొత్తూరు సమీపంలో నివాసం ఉంటూ బైక్ దొంగతనాలపై దృష్టి సారించాడు. మారుతాళాలను తయారు చేయించాడు. తొలిసారిగా 2022 జనవరిలో వేదాయపాళెంలో ఓ బైక్‌ను దొంగలించాడు. తనపై ఎవరికీ అనుమానం రాకుండా ఏడాదిపాటు సెంట్రింగ్ పనులు చేశాడు. ఈ ఏడాది మార్చి నుంచి తిరిగి బైక్ దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. నెల్లూరు నగర పరిధిలోని బస్టాండ్లు, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలతోపాటు తిరుపతి జిల్లా కోటలో బైక్‌లను దొంగిలించాడు. వాటిని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తక్కువ ధరకు అమ్మి జల్సాలు చేయసాగాడు.

నిందితుడి గుర్తింపు ఇలా..

ఎస్పీ ఆదేశాల మేరకు నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి పర్యవేక్షణలో బైక్ దొంగతనాలపై నిఘా ఉంచేలా నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి తన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన బైక్ దొంగతనం కేసు విచారణలో స్థానికంగా ఉన్న సీసీ పుటేజ్‌లను పరిశీలించగా నిందితుడి ఆనవాళ్లు లభ్యమయ్యాయి. సాంకేతికత ఆధారంగా నిందితుడు మల్లికార్జునగా పోలీసులు గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గురువారం కాకుపల్లి వద్ద నిందితుడు ఉన్నాడన్న పక్కా సమాచారం అందుకున్న రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక బృందంతో వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

22 బైక్‌లు స్వాధీనం

నిందితుడిని పోలీసులు తమదైన శైలిలో విచారించగా నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో 5, చిన్నబజారు పోలీసుస్టేషన్ పరిధిలో 4, నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలో 2, సంతపేట పరిధిలో 2, దర్గామిట్ట పరిధిలో 3, వేదాయపాళెం పరిధిలో 2, తిరుపతి జిల్లా కోట పోలీసుస్టేషన్ పరిధిలో 2, మరోచోట 2 మొత్తంగా 22 బైక్‌లను దొంగలించినట్లు తెలిపాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 20 కేసుల్లో రూ.10.04 లక్షల విలువ చేసే 22 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న 22 బైక్‌లలో 3 బైక్‌లు మినహా మిగిలినవన్నీ ఒకే కంపెనీకి చెందినవి కావడం గమనార్హం. నిందితుడిపై సస్పెక్టెడ్ షీటు తెరవనున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ క్రైమ్స్ ప్రసాద్, నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి, ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, ఎస్సై బి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



నిందితులు, గంజాయితో రేణిగుంట ఎస్‌ఈబీ పోలీసులు

సైదాపురం(వెంకటగిరి): విశాఖపట్నం నుంచి బెంగళూరుకు తరలించే క్రమంలో వెంకటగిరి రైల్వే స్టేషన్‌సమీపంలోగురువారం సుమారు రూ.75 వేల విలువ చేసే ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. సెబ్ అధికారుల కథనం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన దేవాంగప్రకాష్, దొడ్డబల్లాపూర్ ఉగ్రప్ప యోగేష్ వెంకటగిరి రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానా స్పదంగా తిరుగుతూ పోలీసులకు కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వారి వద్ద నుంచి ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని బెంగళూరుకు తరలించి అక్కడ విక్రయించేవారని విచారణలో తేలింది. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ తెలిపారు.

గంజాయి పట్టివేత

రేణిగుంట: రేణిగుంట మండలం, తూకివాకం కాలనీ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేసి వారి నుంచి రూ.30 వేల విలువైన గంజాయిని తిరుపతి రూరల్ ఎస్‌ఈబీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు, ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర, ఎస్‌ఐ భాస్కర్, సిబ్బంది పవన్‌కుమార్ తూకివాకం సమీపంలో హైవే పక్కన అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద తనిఖీ చేసి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చిత్తూరు జిల్లా, అల్లమడుగు కేశవరాజాపుర అగ్రహారానికి చెందిన ఎం.ఆర్య, తిరుపతి జిల్లా నాయుడుపేట విన్నమాలకు చెందిన అరవ ప్రవీణ్‌కుమార్, తిరుపతి తిమ్మినాయుడుపాళెం అంబేద్కర్ కాలనీకి చెందిన పీ.ప్రభుగా గుర్తించారు. అలాగే బొమ్మల కాలనీకి చెందిన శ్రీనివాసన్, ఒడిశాకు చెందిన కార్తిక్ ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని వివరించారు. వీరు ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి తిరుపతిలో విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది.

కత్తితో దాడి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): ఓ వ్యక్తిపై కత్తితో దాడిచేయడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లిలో గురువారం చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసుల కథనం.. గుంటకిందపల్లికి చెందిన బత్తెయ్య(24)కు, అతని పక్కింట్లో ఉంటున్న హేమంత్ మధ్య చిన్నపాటి గొడవ ప్రారంభమైంది. ఇది చినికిచినికి గాలివానగా మారడంతో ఆగ్రహంతో హేమంత్ కత్తితో బత్తెయ్యపై దాడిచేశాడు. కత్తిపోటు పొట్టకు ఎగువభాగంలో దిగింది. కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.